క్లుప్తంగా

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

తిరుమలగిరి : ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించింది. తుంగతుర్తి నియోజకవర్గంలో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు ఇలా ఉన్నాయి.. గాదరి కిషోర్‌కుమార్ (బీఆర్ఎస్, కారు), మందుల సామేల్ (కాంగ్రెస్, హస్తం), కడియం రామచంద్రయ్య (బీజేపీ, కమలంపువ్వు), బొడ్డు కిరణ్ (బీఎస్పీ, ఏనుగు), ఈదుల వీరపాపయ్య (మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, కెమెరా), కె.ఇందిరా (తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, బీరువా), దాసరి బాలస్వామి (ధర్మ సమాజ్ పార్టీ, బ్యాటరీ టార్చ్), దేవరకొండ జానయ్య (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, డొల్లి), సిరిపంగి నర్సింహ (బహుజన్ రిపబ్లికన్ సోషలిస్టు పార్టీ, గ్యాస్ సిలిండర్), బి.అనంతయ్య (యువ తులసి పార్టీ, రోడ్ రోలర్), ఎస్.అరవింద్‌కుమార్ (ఇండిపెండెంట్, చపాతి రోలర్), రవి ప్రసాద్ (ఇండిపెండెంట్, పెన్ స్టాండ్), కొంగరి మల్లయ్య (ఇండిపెండెంట్, కుట్టుమిషన్), యాతాకుల శేఖర్ (ఇండిపెండెంట్, బెండకాయ).

కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసుకొని కేంద్రాలకు తేవాలని తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం, కుంచమర్తి, కొమ్మాల, కోడూరు, అడివెంల గ్రామాల్లో గురువారం పీఏసీఎస్, సెర్ప్, ఎన్‌డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం ఆరబెట్టాక 17 శాతం లోపు తేమ ఉండేలా చేసి కేంద్రాలకు తెస్తే మద్దతు ధర దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఓటరు సమాచార పత్రాలు పంపిణీ చేయాలి




అర్వపల్లిలో ఓటర్లకు సమాచార పత్రాలు పంపిణీ చేస్తున్న బీఎల్ఓ నవనీత

అర్వపల్లి: ఎన్నికల కమిషన్ అందించిన ఓటరు సమాచార పత్రాలను బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు పంపిణీ చేయాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. గురువారం మండల వ్యాప్తంగా బీఎల్ఓల ఆధ్వర్యంలో ఓటరు సమాచార పత్రాల పంపిణీని ప్రారంభించారు. ఈ నెల 20 వరకు బీఎల్ఓలు 23,826 మంది ఓటర్లకు సమాచార పత్రాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఎల్ఓలు నవనీత, సునంద పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

సూర్యాపేట : మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై బీఆర్ఎస్ పార్టీ 40వ వార్డు కౌన్సిలర్ తాహెర్ పాషా వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు పిడమర్తి రేణుక నిరసన తెలిపి మాట్లాడారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని 40వ వార్డులో విధుల్లో భాగంగా చెత్త సేకరిస్తుండగా తాహెర్ పాషా అకారణంగా దూషించాడని చెప్పారు. చెత్త సేకరణ ట్రాక్టర్ డ్రైవర్‌ను సైతం దుర్భాషలాడాడని తెలిపారు. అంతేకాకుండా పదిమంది పారిశుద్ధ్య కార్మికులను సెలవులు పెడుతున్నారనే కారణంతో విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే మున్సిపల్ కమిషనర్ సంతకం పెట్టించుకుని రావాలని, ఆ తర్వాతనే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్తున్నారని అన్నారు. వెంటనే ఫిర్యాదు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా



రాజీనామా చేసిన నాయకులు

తిరుమలగిరి : తెలంగాణ ఉద్యమంలో పని చేసిన తమకు బీఆర్ఎస్‌లో ప్రాధాన్యం లేదని ఆ పార్టీకి చెందిన పలువురు గురువారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో 2001 నుంచి పాల్గొని ఉద్యమ సమయంలో పోలీసులతో దెబ్బలు తిన్నామని, కేసుల పాలయ్యామని అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తమకు కనీస గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడైన మందుల సామేల్‌కు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిందని, సామేల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తిరుమని యాదగిరి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దుంపల కృష్ణారెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ బత్తుల శ్రీను, సుంకరి జనార్దన్, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టునాయక్, కందుకూరి లక్ష్మయ్య, వెంకటమ్మ, హీరూనాయక్, ఉప్పలయ్య, లింగయ్య, కందుకూరి రోశయ్య, రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖర్చుల వివరాలు నమోదు చేయాలి



సూర్యాపేటలో అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అధికారులు



తుంగతుర్తి ఆర్వో కార్యాలయంలో..

భానుపురి : సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థులు ప్రతి రోజు తమ ఖర్చులను అభ్యర్థులకు ఇచ్చిన దస్త్రాల్లో పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు విజయ్‌నెట్క్, జనరల్ అబ్జర్వర్ బాల్ కిషన్ ముండా అన్నారు. గురువారం పట్టణంలోని సూర్యాపేట ఆర్వో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వీరబ్రహ్మచారి అధ్యక్షతన అభ్యర్థులకు ఖర్చుల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ఎన్నికల సంఘం రూపొందించిన కార్యాచరణ ప్రకారం అన్ని విభాగాలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన టీమ్‌లు చురుకుగా పనిచేసి అభ్యర్థుల వ్యయాలను నిశితంగా పరిశీలించాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచార రథాలను వీడియోల ద్వారా చిత్రీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, ఏఆర్ఓ శ్యాంసుందర్, అసిస్టెంట్ ఆంజనేయులు, లింగయ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల సంఘం రూపొందించిన నియమాలను పాటించాలని ఎన్నికల పరిశీలకుడు బాల్‌కిషన్ ముండా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్వహించే ప్రచార సభలకు 24 గంటల ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు నిరూపితమైతే వారిపై చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే వీడియో, ఫొటోలు వాట్సప్ ద్వారా లేక సంక్షిప్త సందేశం ద్వారా ఎన్నికల వ్యయ పరిశీలకుడి నంబర్ 08019 224583కు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో నిఘా కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికలను సజావుగా జరిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు వివరాలను అధికారులకు పారదర్శకంగా అందజేయాలన్నారు. ప్రతి అభ్యర్థి బ్యాంకుల ద్వారానే లావాదేవీలు జరపాలని సూచించారు. సివిజల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తామని తెలిపారు. ప్రతి అభ్యర్థి రోజు వారి ఖర్చులను నమోదు చేసి కార్యాలయంలో సమర్పించాలన్నారు. తమ ఆర్థిక లావాదేవీలను ఇటీవల నూతనంగా తెరిచిన బ్యాంకు ఖాతాల్లో చెక్కుల ద్వారా జరపాలని సూచించారు. మరోవైపు అభ్యర్థులు పెట్టే ఖర్చులు, వాహనాల ఖర్చు ఎప్పటికప్పుడు సూక్ష్మ పరిశీలకులు నమోదు చేస్తారని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొద్దని అభ్యర్థులను కోరారు. ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు విజయ్‌నెట్కే, రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ ఎన్నికల అధికారి యాదగిరిరెడ్డి, డీటీ హరిశ్చంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డిని మరోసారి గెలిపించాలి

సూర్యాపేట : సూర్యాపేటలో పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని గుర్తించి మరోసారి మంత్రి జగదీష్ రెడ్డిని గెలిపించాలని సూర్యాపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి జగదీష్ రెడ్డి సతీమణి సునీత అన్నారు. గురువారం 6వ వార్డు దాసాయిగూడెంలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గత పాలకుల కాలంలో సూర్యాపేట పట్టణంలో 14 రోజులకోసారి నీళ్లు వచ్చేవని, ఇప్పుడు మిషన్ భగీరథ పుణ్యమా అని రోజూ తాగునీళ్లు వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్‌తోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. మరోసారి మంత్రి జగదీష్‌రెడ్డికి అవకాశం ఇస్తే సూర్యాపేటలో పారిశ్రామిక హబ్ ఏర్పాటుచేసి 10,000 మంది యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తారని తెలిపారు. మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3000, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన 93 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల కేసీఆర్ బీమా పథకం, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, ఇళ్లు లేని నిరుపేదలకు ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు వంటి పథకాలను బీఆర్ఎస్ అమలు చేస్తుందని అన్నారు.

అన్నాదురై నగర్‌లో ప్రచారం..

60 ఏళ్లలో జరగని అభివృద్ధిని తొమ్మిదిన్నరేళ్లలో చేసి చూపించిన మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిని మూడోసారి ప్రజలు ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని జిల్లా బీఆర్ఎస్ న్యాయవాదులు నల్లగుంట్ల అయోధ్య, గుండ్రాల అశోక్, తలమల్ల హసేన్‌లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం కనకదుర్గ ఆలయంలో పూజలు నిర్వహించి అన్నాదురై నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



సూర్యాపేట : దాసాయిగూడెంలో ప్రచారం చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి సతీమణి సునీత



ప్రచారం చేస్తున్న న్యాయవాదులు

కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మోదుగు వెంకటరెడ్డి, రేగటి లింగయ్య గౌడ్, పిట్టల వెంకటేశ్వర్లు, జిలకర చంద్రమౌళి, దొంతరబోయిన నారాయణ, కంచుకోముల వెంకట్, హనుమాన్, అబ్దుల్ లతీఫ్, ఇబ్రహీం, రేగటి శంకరయ్య గౌడ్, అనుములపూరి సైదులు, తోగిటి మురళి, చిప్పలపల్లి చిరంజీవి, డప్పు వంశీ, మీసాల శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, డాకా శ్రీనివాస్‌నాయుడు, రాచకొండ యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు అయుబ్ ఖాన్, సారగండ్ల మాణిక్యమ్మ, రావుల రమణయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓటేస్తే నష్టపోతాం



బీజేపీలో చేరుతున్న వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు



సంకినేనిని ఆశీర్వదిస్తున్న మహిళలు

దురాజ్‌పల్లి : బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను నమ్మి ఓటేస్తే నష్టపోతామని సూర్యాపేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని దాసాయిగూడెం, రాంకోటితండాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా నేటికీ పేదలకు పూర్తి స్థాయిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు. రేషన్ కార్డులు మంజూరు చేయని దుర్మార్గమైన ప్రభుత్వం సీఎం కేసీఆర్ ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. గత ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ నాయకుల మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. అక్రమంగా సంపాదించిన డబ్బులతో మంత్రి జగదీష్ రెడ్డి ఓటర్లను కొనుగోలు చేస్తున్నాడని ఆరోపించారు.

బీజేపీలో పలువురి చేరికలు..

సూర్యాపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరుతున్నారని, మంత్రి జగదీష్‌రెడ్డికి కాలం చెల్లిందని సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మున్సిపల్ చైర్మన్ వార్డుకు చెందిన బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ అనుములపురి రామకృష్ణ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. అదే విధంగా 18వ వార్డు సుందరయ్యనగర్‌కు చెందిన 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, చివ్వెంల మండలం గాయంవారిగూడెం, గుంపుల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారిలో మహేష్, ఈశ్వర్, శేషు, తరుణ్, అభిషేక్, ప్రవీణ్, సంతోష్, లింగరాజు, పవన్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆర్డీఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి : ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆరు గ్యారంటీలను గడప గడపకూ తీసుకెళ్లాలని సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీరాంనగర్‌లో మాజీ కౌన్సిలర్ గునగంటి వంశీధర్‌తోపాటు 500 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆర్డీఆర్ వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు మేలు

పట్టణంలోని 26వ వార్డు బీఆర్ఎస్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ పోలబోయిన నర్సయ్య యాదవ్ గురువారం దామోదర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. కార్యక్రమంలో యువనాయకుడు సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వరరావు, పెద్దిరెడ్డి రాజా పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని సేవాలాల్ తండాకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వార్డు సభ్యులు గుగులోతు మురళీ, గుగులోతు నీలా, గుగులోతు వీరన్నతో పాటు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో గుగులోతు నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎలగబోయిన మధు ఆధ్వర్యంలో టేకుమట్ల గ్రామం నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పసుపుల మల్లయ్య, వీరయ్య, శేఖర్, చిన్న మల్లయ్య, హుస్సేన్, సత్యం, బాలరాజు, నగేష్ పాల్గొన్నారు.

మోసపూరిత కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మొద్దు

- తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్

నూతనకల్ : మోసపూరిత వాగ్దానాలతో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మవద్దని తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మాచనపల్లి, పెదనెమిల, బిక్కుమళ్ల, దిర్శనపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి రావడం కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సుదీర్ఘ ఉద్యమం నిర్వహించి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బడుగు, బలహీన వర్గాలు, రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ దేశంలోనే తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలిపాడని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌నే గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా దిర్శనపల్లి గ్రామానికి చెందిన 40మంది కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, రామసాయం జనార్దన్‌రెడ్డి, కప్పల రామ్మూర్తి, అనుఫ్‌రెడ్డి, చక్రధర్, ఎడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు గురువారం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూపటి రవీందర్, యాకూబ్‌నాయక్, వెంకన్న, యాదగిరి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



బిక్కుమళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్



మాచనపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



వెంపటిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



పేరబోయినగూడెంలో..

బీఆర్ఎస్‌తోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు

తుంగతుర్తి : బీఆర్ఎస్ పాలనలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగేందర్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంపటి, రావులపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తుంగతుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కేతిరెడ్డి గోపాల్‌రెడ్డి, సర్పంచ్ అబ్బగాని పద్మ, సత్యనారాయణ, ఎంపీటీసీ వీరస్వామి, తునికి సాయిలు, హరీష్, వెంకన్న, నాగయ్య, నగేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగారం : తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం పేరబోయినగూడెం గ్రామంలో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తీగుళ్ల ప్రశాంత్, ప్రేమయ్య, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పనులు చేసినా.. కూలి రాదాయే!

- నర్సరీల్లో పనులు చేస్తున్న కూలీలకు మూడు నెలలుగా అందని డబ్బులు
- సకాలంలో పైసలు రాకుంటే కుటుంబం గడిచేదెలా అని కూలీల ఆవేదన



నర్సరీలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

పెన్‌పహాడ్ : రాష్ట్రాన్ని పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చాలనే ఉద్దేశంతో తలపెట్టిన హరితహారం కార్యక్రమం పెన్‌పహాడ్ మండలంలో నత్తనడకన కొనసాగుతోంది. మూడు నెలల నుంచి చేసిన పనులకు డబ్బులు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పని చేస్తేగాని పూటగడవని కూలీలు డబ్బుల కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో కూలి ఇస్తేనే పనికి వస్తామని చాలామంది కూలీలు అంటున్నారు. దీంతో మొక్కల సంరక్షణ చూసేవారు లేక రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు వాడిపోతున్నాయి. పెన్‌పహాడ్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ప్రతి ఏడాది నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటడం, వాటి సంరక్షణ చేపట్టడం తదితర పనులకు ప్రభుత్వం అనేక నిధులు ఖర్చు చేస్తోంది. హరితహారం కార్యక్రమానికి సంబంధించిన పనులన్నీ కూలీలతో చేయిస్తున్న అధికారులు వారికి డబ్బులు చెల్లించడంలో మాత్రం జాప్యం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రెండు నెలల క్రితం చెట్లు నాటడం, వాటికి నీరు పోయడం, వన నర్సరీల్లో మట్టి ప్యాకెట్లు నింపడం వంటి పనులు చేసినా ఇప్పటివరకు కూలి డబ్బులు రాలేదని కూలీలు వాపోతున్నారు. గతంలో చేసిన పనికి కూలి ఇస్తేనే మళ్లీ పనులకు వెళ్తామని వారు చెబుతున్నారు. డబ్బులు రాకుంటే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయని వాపోతున్నారు.

త్వరలో డబ్బులు వస్తాయి



ఉపాధి కూలీల డబ్బులు త్వరలోనే వస్తాయి. ఎవరూ ఆందోళన చెందవద్దు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులకు ఆటంకం కలకుండా కూలీలు పనులు చేసుకోవాలి. రోడ్ల వెంబడి పెంచుతున్న మొక్కలను వందశాతం సంరక్షించేలా చర్యలు తీసుకుంటాం. నాటిన ప్రతి మొక్క బతకాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

- రవి, ఏపీఓ

గాదరి కిషోర్‌కే మాదిగల మద్దతు



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఆకారపు సైదులు

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గంలోని మాదిగ సామాజిక వర్గం మొత్తం బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కే మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ వర్గం సామాజిక నాయకుడు ఆకారపు సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గానికి గాదరి కిషోర్‌కుమార్ ఎమ్మెల్యే అయిన తర్వాతనే మాదిగలకు అన్ని రంగాల్లో ప్రముఖ స్థానం కల్పించారని అన్నారు. దళిత బంధు పథకం కూడా 90 శాతం మాదిగలకే కేటాయించారని తెలిపారు. ఈ సమావేశంలో మాదిగ జాతి నాయకులు తడకమళ్ల రవికుమార్, పోలేపాక సోమయ్య, వెంకన్న, వీరయ్య, మనోజ్, చంటి, పరమేష్, పరశురాములు, సోమేష్, విజయ్, వెంకన్న, సురేష్, గిరి, సైదులు పాల్గొన్నారు.

మద్దిరాల : మాదిగలంతా బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ వైపే ఉన్నారని టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మరికంటి వెంకటయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టీఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా నియోజకవర్గంలోని మాదిగలకు రాజకీయ, ఆర్థిక భరోసా కల్పించిన గాదరి కిషోర్‌కుమార్‌కే టీఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంపాక వెంకన్న, గోల్కొండ మల్లేష్, మల్లెపాక వెంకన్న, కొమ్ము వెంకన్న, పాల్వాయి వెంకన్న పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ



ఎస్. రాధిక

నూతనకల్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో మండల పరిధిలోని ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్. రాధిక ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం ఉయ్యాల ప్రసాద్‌గౌడ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానం పొందినట్లు తెలిపారు.

క్రికెట్ కిట్ అందజేత

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ప్రగతిశీల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. గ్రామానికి చెందిన దాత నల్లు బాల్‌రెడ్డి సహకారంతో గురువారం ప్రాథమిక పాఠశాలకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. పాఠశాలల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సోమయ్య, ఉపాధ్యాయులు దబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బాలికలను బాలురతో సమానంగా చూడాలి

ఆత్మకూర్ (ఎస్) : ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ఎంవీ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల సమభావన సంఘాలు, గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో కిశోర బాలికల తల్లులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత, నాయిని సైదులు, అలివేల, జయలలిత, సంఘ బంధం లీడర్లు నరసమ్మ, వీబీకే వెంకటమ్మ, ప్రియ, అనిత తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో కార్తీక మాస పూజలు

భానుపురి : పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో శ్రీ సత్యసాంబశివ స్వామికి కార్తీక మాసం సందర్భంగా నెల రోజులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ తెలిపారు. గురువారం ఆలయంలోని ఆధ్యాత్మిక గ్రంథాలయంలో కార్తీక మాస పూజల కరపత్రాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పబ్బా ప్రకాష్, సోమ శ్రీశైలం, కొత్త మల్లికార్జున్, దేవరశెట్టి సోమయ్య, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, తాళ్లపల్లి రామయ్య, నామిరెడ్డి పాపిరెడ్డి, యామా వెంకటేశ్వర్లు, మహంకాళి ఉపేందర్, గోపారపు రాజు, బజ్జురి శ్రీనివాస్, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న అధికారి సకలరెడ్డి

నూతనకల్ : కుష్టు వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఫైలేరియా టీమ్ అధికారి సకలరెడ్డి అన్నారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణపై వైద్యసిబ్బందికి, ఆశావర్కర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని, చర్మంపై మొద్దుబారిన మచ్చలను గుర్తించి చికిత్స అందించినట్లయితే వ్యాధిని నిర్మూలించవచ్చని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నూతనకల్ : రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజలు ఓటు ద్వారా అంతమొందించాలని తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. గురువారం వెంకెపల్లి, పెద నెమిల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

కాసర్లపహాడ్‌కు చెందిన 100మంది

అర్వపల్లి : కాసర్లపహాడ్‌కు చెందిన దాదాపు 100 మంది గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారిని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తిరుమలగిరి : రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మూల అశోక్‌రెడ్డి గురువారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. రాజీనామా చేసిన వారిలో మాజీ సర్పంచ్ హరిశ్చంద్రనాయక్ తదితరులున్నారు.

ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిది

సూర్యాపేటటౌన్ : ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టీఎస్ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో గాంధీ గ్లోబల్, ఫ్యామిలీ, డాక్టర్ రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్, సాంఘిక శాస్త్ర ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైదులు, శ్రీనస్య, సుదర్శన్‌రావు, ప్రసాద్, మురళి, మమత, సోమయ్య, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పెన్‌పహాడ్ : ఎన్ఎంఎంఎస్ సెంట్రల్ స్కాలర్‌షిప్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ సహకారంతో గురువారం స్టడీ మెటీరియల్ అందజేసినట్లు హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, వెంకన్న, శోభన్, కోటేశ్వరరావు, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ టీకాలు

అర్వపల్లి : ప్రభుత్వం అందించే టీకాలను జీవాలకు పెంపకందారులు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్ కోరారు. రామన్నగూడెంలో గురువారం 500 గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్ పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి, పెంపకందారులు వినయ్‌యాదవ్, వెంకన్న, ఆదెమ్మ, లింగయ్య, వినోద్, జానయ్య పాల్గొన్నారు.